క్లుప్తంగా

హైదరాబాద్ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌గుప్తా



లక్ష్మణ్‌గుప్తాను సన్మానిస్తున్న పాతబస్తీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

గౌలిపురా: పాతబస్తీ లాల్‌దర్వాజాకు చెందిన సరాబు లక్ష్మణ్‌గుప్తా హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాచిగూడ వైశ్య హాస్టల్‌లో నిర్వహించిన ఆదివారం ఎన్నికల్లో అధ్యక్షుడిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాతబస్తీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సరాబు లక్ష్మణ్‌గుప్తాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా లాల్‌దర్వాజా సంఘం అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, మాజీ అధ్యక్షులు శ్రీరాం కోటయ్య, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్‌గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులుగుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్

చాంద్రాయణగుట్ట: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షలో శంషీర్‌గంజ్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను అన్ని అంశాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆషా పట్నాయక్, డీన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ

దూద్‌బౌలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పేదలు లబ్ధి పొందేందుకు కృషి చేయాలని చార్మినార్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం చార్మినార్ నియోజకవర్గం ఘాన్సీబజార్ లైబ్రెరీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మనీష్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహ్మద్ సలావుద్దీన్ లోధీ, హైదరాబాద్ కంటెస్టెడ్ ఎంపీ పుస్తె శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష గోపిగౌడ్, సీనియర్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు హీరోలాల్ దిగంబర్, ఫణిందర్‌గౌడ్, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

సీతారామ చంద్రమూర్తుల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడిలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రభాత పూజ, హారతి, నిత్య పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు కల్యాణమూర్తుల ఊరేగింపు సేవను నిర్వహించారు. సీతారామ చంద్రమూర్తుల ఊరేగింపు సేవ ఆలయం నుంచి ప్రారంభమై కోమటివాడి, డబీర్‌పురా దర్వాజా, బోధే అలీషా కిడికి, నూర్‌ఖాన్‌బజార్, కట్టెలగూడ, దర్బార్ మైసమ్మ ఆలయం, ఆర్య సమాజ్ మీదుగా తిరిగి ఆలయం వరకు కొనసాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు

- ఇఫ్తార్ విందులతో కళకళలాడుతున్న మక్కా మసీదు
- మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఎక్కడో ఒకచోట రోజూ ఇఫ్తార్ విందులు
- ఈసారి జరుగుతున్న ఇఫ్తార్ విందులన్నింటిలో పాల్గొంటున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చార్మినార్: పాతబస్తీలో ఇఫ్తార్ విందులు జోరుగా కొనసాగుతున్నాయి. రంజాన్ మాసంలో ప్రతిరోజూ సాయంత్రం ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నారు. పాతబస్తీలో జరిగే ఇఫ్తార్ విందులకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా మక్కా మసీదులో రోజు సాయంత్రం ఇఫ్తార్ విందులు జరుగుతున్నాయి. ఎవరికి వారే ఖర్జూరంతో పాటు ఇతర పండ్లు తమ వెంట తెచ్చుకుని మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనలు ముగించుకుని ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నారు. అక్కడక్కడ హిందువులు సైతం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలను ఆహ్వానిస్తారు. దీంతో పాతబస్తీలో ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

రద్దీగా అంతర్గత రోడ్లు..

రోజంతా ఐదుసార్లు నమాజ్ చేస్తూ కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్నారు. ఖర్జూరంతో ఉపవాస దీక్షలను వదిలి పండ్లు, మాంసాహార వంటలతో ఇఫ్తార్ విందు కొనసాగిస్తారు. కుటుంబసభ్యులు, బంధువు, మిత్రులు, అధికార, అనధికార ప్రముఖులు ఇఫ్తార్ విందుల్లో పాల్గొంటారు. దీంతో ప్రతిరోజూ సాయంత్రం ప్రధాన వీధులతో పాటు అంతర్గత రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. అవసరమైన చోట ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఉత్సాహాన్ని నింపుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ..

ప్రస్తుతం పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న ఇఫ్తార్ విందుల్లో మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ పాల్గొని స్థానిక మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సవాన్ని నింపుతున్నారు. ఇప్పటికే చాంద్రాయణగుట్టలోని దాదాపు అన్ని డివిజన్ పరిధిలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అక్బరుద్దీన్ ఒవైసీ పత్తర్‌గట్టి డివిజన్ మాజీ కార్పొరేటర్ మోహసిన్ బలాల ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



మక్కా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఆయనతో పాటు చార్మినార్, మలక్‌పేట్ ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, అహ్మద్ బలాల, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 1న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ ఆధ్వర్యంలో నానల్‌నగర్ డివిజన్‌లోని సాలార్ బ్రిడ్జి వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అబిడ్స్: కళాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నిరంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కవయిత్రి ఎంటీ.స్వర్ణలత రాసిన 'స్వర్ణాక్షరాలు కవితా సంపుటి'ని హోంమంత్రి మహమూద్ అలీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన కవుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళలను తీర్చిదిద్దే కవిత్వం ఎంతో అవసరం ఉందన్నారు. కవయిత్రి స్వర్ణలత తన కవితలను సమాజం అభివృద్ధి చెందే విధంగా అన్నివర్గాలు సమృద్ధి పొందే విధంగా కవితలు రాయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరించిన హోంమంత్రి మహమూద్ అలీ, కవయిత్రి ఎంటీ స్వర్ణలత

రంజాన్ పవిత్ర మాసం: ఎమ్మెల్యే కౌసర్



మసీదు నిర్వహణ కమిటీ వారితో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: రంజాన్ ఎంతో పవిత్ర మాసం అని, ఈ నెలలో ముస్లింలంతా ఉపవాస దీక్షలో ఉండడమే కాకుండా ఐదు పూటల నమాజ్ ఆచరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ బంజారా దర్వాజ అల్కాపూర్ వద్ద గల కుతుబ్‌షాహీ మసీదులో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాగా కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి మసీదును అభివృద్ధి చేస్తున్న నిర్మాణ కమిటీ వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గులాం మొహియుద్దీన్ ఖాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, హారూన్ ఫరాన్, షకీల్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

అఫ్జల్‌గంజ్: పదవ తరగతి విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచినట్లు టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ రీజియన్ మేనేజర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 8.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఇంటి వద్ద నుంచి పరీక్షా కేంద్రం వరకు పరీక్ష అనంతరం తిరిగి ఇంటి వరకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు, బస్ పాసులను కండాక్టర్‌కు చూపించాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కాంబీ టికెట్టుపై అనుమతిస్తారని, బస్‌పాస్ లేని వారు నార్మల్ టికెట్టు తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎంజీబీఎస్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు వినియోగించుకోవాలని సూచించారు.

కార్పొరేటర్ పర్యటన



రాహుల్ కాలనీవాసులతో కార్పొరేటర్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో ఆదివారం బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజ్ ఉద్దీన్ పర్యటించారు. రాహుల్‌కాలనీ-2లో పూర్తయిన వీడీసీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయనను సన్మానించారు.

క్రమశిక్షణ గల జీవితాన్ని గడపాలి

చార్మినార్: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ గల జీవితాన్ని గడపాలని మౌలానా జహీముద్దీన్ హుస్సామీ అన్నారు. యంగ్ మెన్స్ ముస్లిం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యాకుత్‌పురాలో హజ్రత్ బీబీ ఖతీజా ఎల్ ఖుబ్రా జల్సా జరిగింది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్స్ ముస్లిం అసోసియేషన్ అధ్యక్షుడు ఎజాజ్ అలీ ఖురేషీతో పాటు నాయకులు మహ్మద్ జహీర్, మహ్మద్ కరీంఖాన్, మహ్మద్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలానా జహీముద్దీన్ హుస్సామీ

ఆకట్టుకున్న సినీ గ్రాండ్ మ్యూజికల్ నైట్



పురస్కారాల గ్రహీతలతో పలువురు అతిథులు

గన్‌ఫౌండ్రీ: ఆ పాత మధుర గీతాలను గాయకులు ఆలపించి సంగీత ప్రియులను సమ్మోహన పరిచారు. ఆదివారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ గ్రాండ్ మ్యూజికల్ నైట్ ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులకు విశ్వకళ సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్రో హైదరాబాద్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డీవీ.రాజు, మానసిక నిపుణులు జాన్ హేమంత్‌కుమార్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, సంస్థ వ్యవస్థాపకులు జీఎస్ జే.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గోల్కొండ: పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని గోల్కొండ జోన్ విద్యాశాఖ డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 11.410 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరిలో బాలురు 5287, బాలికలు 6123 మంది విద్యార్థులు ఉన్నారని ఆయన తెలిపారు. మొత్తం 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో బాలబాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా తాగునీటిని కూడా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ హాల్ టికెట్లతో పరీక్షా సమయానికంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

'బీఆర్‌ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతోంది'

హోంమంత్రి మహమూద్ అలీ

గోల్కొండ: బీఆర్‌ఎస్ పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం కార్వాన్ మోహిని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ చూడలేకనే బీజేపీ నాయకులు తెలంగాణ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థికంగా ఎంతో బలమైన రాష్ట్రంగా తయారయ్యిందని, హైదరాబాద్‌లో విదేశీ కంపెనీలు విరివిగా పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.ప్రభాకర్, బీఆర్‌ఎస్ కార్వాన్ ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్, నాయకులు సాగర్, భాస్కర్, అంబటి శ్రీనివాస్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



హోంమంత్రిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్‌రెడ్డి తదితరులు

మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గం అడ్‌హక్ కమిటీ సభ్యుడు శేఖర్‌రెడ్డి ఆదివారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని సన్మానించారు.

ప్రమాదకరంగా గుంత



చార్మినార్: ఘాన్సీబజార్ డివిజన్‌లోని చౌక్ మైదాన్ ప్రధాన రోడ్డులో తవ్వి వదిలేసిన గుంతలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు ఆదివారం రాత్రి పడ్డాడు. కొంత కాలంగా మరమ్మతు పనుల కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ తవ్వి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత వెంటనే పనులు పూర్తి చేసి గుంతలను మూసివేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



డీసీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

గౌలిపురా: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్‌లో ఆదివారం శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్ పాఠశాల, శ్రీ సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ స్వర్ణోత్సవాలకు పాఠశాల అధ్యక్షుడు విజయ్ విఠల్ దాస్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, మాజీ ఎంపీ గిరీష్ సంఘీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పచుకొని దానికనుగుణంగా తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పెడ్డిలర్స్ సైకిల్ కంపెనీ డైరెక్టర్ ప్రదీప్ షా, తెలంగాణ పూర్వ విద్యార్థి అధ్యక్షులు హరిష్మరస్ రెడ్డి, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, పాఠశాల కార్యదర్శి సిహెచ్.రూప్‌రాజ్, అరహం ఫ్రెండ్స్ క్లబ్ ఏ జైన్ సోషల్ ఆర్గనైజేషన్, పాఠశాల సమితి, కమిటీ సభ్యులు, ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

సన్మానం

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు ఆదివారం వీడ్కోలు సన్మాన సభను నిర్వహించారు. మాలిగా పని చేస్తున్న షేక్ బషీర్, మహ్మద్ అఫ్జల్, ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న ఈదయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్, డిప్యూటీ క్యూరేటర్ నాగమణి ముగ్గురు ఉద్యోగులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న జూపార్కు క్యూరేటర్

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మమత రాణి తదితరులు

చార్మినార్: మీరాలంమండిలోని మహంకాళేశ్వర అమ్మవారు ఎంతో మహిమ గల తల్లి అని తెలిసి తాను ఇక్కడ పూజలు నిర్వహించానని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ మమత రాణి తెలిపారు. ఆదివారం బిహార్ నుంచి నగరానికి వచ్చిన ఆమె మహంకాళేశ్వర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీతో పాటు నాయకురాలు దశరథ లక్ష్మి, మంజులారెడ్డి, రుక్మిణీ, స్వప్న, నళినీ, రేణుక ముదిరాజ్ తదితరులు ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికి సన్మానించారు.

పల్లె నాగేశ్వర్‌రావు విజయం పట్ల హర్షం



పల్లె నాగేశ్వర్‌రావుకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదుల బృందం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లె నాగేశ్వర్‌రావు విజయం సాధించడం పట్ల ట్రస్టెడ్ అడ్వొకేట్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి సురేందర్ కుమార్ ఆయనను కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు గెలవడం ఎంతో గొప్ప విషయమన్నారు. న్యాయసేవలను మరింత విస్తతం చేయండంతో పాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి నరేష్, సంయుక్త కార్యదర్శి నీరజ్ ఠాకూర్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.


పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో కేవీ.రమణాచారి

నాంపల్లి: తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు ప్రదానోత్సవ సభ జరిగింది. 'సత్యవోలు రాంబాబు'అధ్యక్షతన ఆదివారం ఉదయం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 14 మంది తెలుగు వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మీకాంతం, డాక్టర్ సారంగపాణి, డాక్టర్ ప్రేమకుమార్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సంస్థ విశేష కృషి స్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా యాదయ్యగౌడ్, కో చైర్మన్, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, సత్యనారాయణ, రవిచరణ్ మరియు పూజిత పాల్గొన్నారు. పురస్కారాలను అందుకున్నవారిలో సర్వశ్రీ దంతూరి పండరీనాథ్, నల్లాన్ చక్రవర్తి మూర్తి, గొట్టిపాటి సత్యవాణి, వీవీఆర్ కృష్ణమరాజు, లంకా సత్యనారాయణ, తన్నీరు రామకృష్ణ యతీంద్రులు, ఇంద్రగంటి నరసింహమూర్తి, నెమలికంటి సువర్ణలత, స్వర వీణాపాణి, కడలి సురేశ్ రంగ, సుభాని షేక్, కరుణాకర్ రెడ్డి, డాక్టర్ మల్లెపూడి చిన్నబాబూరావు, రామతులసి వీరరాజులు పురస్కారాలు అందుకున్నారు.

పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న యెగ్గె మల్లేష్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్

అబిడ్స్: దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి కురుమ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేష్, కురుమ యూత్ అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, బండారు నారాయణ, క్యామ మల్లేశం, ఎక్కాల కన్న, నర్సింహా, రాజ్‌కుమార్, సుధాకర్, కొండల్ రాజ్, విమల్ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు.

ఎక్కడి చెత్త అక్కడే..?



వినతి పత్రం అందజేస్తున్న మహేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాకేష్

- గుడిమల్కాపూర్‌లో పేరుకుపోతున్న కూరగాయల వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కూరగాయల మార్కెట్‌లో పడిఉన్న కూరగాయల వ్యర్థాలు

అబిడ్స్: గుడిమల్కాపూర్‌లో కూరగాయల మార్కెట్ హోల్‌సెల్ వ్యాపార కార్యకలాపాలు సాగుతుంటాయి. ప్రతినిత్యం టన్నుల కొద్ది కూరగాయల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అలాగే కూరగాయల వ్యర్థాలను సకాలంలో ఎత్తివేయకపోవడంతో అవి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో పరిసర ప్రాంతాల కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా కూరగాయలను ఎత్తివేయకపోగా వాటిని కాలుస్తుండడంతో పొగ వ్యాపిస్తుంది. రాత్రి వేళల్లో కాలుస్తుండడంతో పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు స్థానిక మహేష్‌నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డులో కూరగాయల వ్యర్థాలను సకాలంలో ఎత్తివేయాలని, అంతేకాకుండా మార్కెట్‌లో కూరగాయల వ్యర్థాలను కాలుస్తుండడంతో తమ కాలనీకి పొగ వ్యాపించి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని మహేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముల్లె రాకేష్ గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. చెత్త కాంట్రాక్టర్ చెత్త ఎత్తివేయకపోవడంతో ఈ సమస్య ఎదురవుతున్నాయన్నారు. మార్కెట్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కూరగాయల వ్యర్థాలను సకాలంలో ఎత్తివేయడంతో పాటు కాల్చకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.